క్లుప్తంగా

మద్యం దుకాణం మూసివేతపై హర్షం



నక్కవానిపాలెంలో మూతపడిన మద్యం దుకాణం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల మద్యం దుకాణం మూసివేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గత నెలలో ఇక్కడ వైజాగ్ వైన్స్ పేరిట మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడికి సమీపంలోనే కనకదుర్గ ఆలయం ఉంది. వాస్తవానికి ఆలయానికి వంద మీటర్ల లోపు మద్యం దుకాణాలు పెట్టరాదన్న నిబంధన ఉన్నప్పటికీ ఏర్పాటు చేశారు. మరోవైపు పిల్లలు, మహిళలు తిరిగేచోట మద్యం దుకాణం ఏర్పాటుతో స్థానికులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఆ దుకాణం ఇక్కడ సోమవారం మూసేసి వేరే చోటుకు తరలించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సీతంపేట : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం 10 గంటలకు ప్రారంభ సమావేశం, 15న సాయంత్రం విశాఖ సాహితి ఆధ్వర్యంలో సాహిత్య క్విజ్, 16న సాయంత్రం విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో కవితా గోష్టి నిర్వహిస్తామని తెలిపారు. 17న సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో వినోద వల్లరి కామెడీ స్కిట్స్, 18న ఉదయం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి, 19న సాయంత్రం అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహితీ ప్రసంగం, 20న సాయంత్రం 6 గంటలకు సహృదయ సాహితి ఆధ్వర్యంలో కథా రచయితలతో చర్చా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

కల్వర్టు నిర్మించాలని వినతి



అక్కయ్యపాలెంలో బ్రిడ్జి శిథిలం కావడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

సీతమ్మధార : జీవీఎంసీ 43వ వార్డు అక్కయ్యపాలెం కర్రి వారి వీధిలో కల్వర్టు లేక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఆ పార్టీ నాయకురాలు శ్యామలాదీపికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలు నిలిచిపోయాయని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్పందించి కొత్త బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కాలుష్య నియంత్రణకు సహకరించాలి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని నియంత్రించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా నియంత్రణకు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

అన్నదాన ప్రభువే శరణమయ్యప్ప

- మాలధారులకు శుచిగా, రుచిగా భిక్ష
- అక్కయ్యపాలెంలో పలుచోట్ల ఏర్పాటు



పోర్టు ఆస్పత్రి కూడలి వద్ద ఎరుమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న మాలధారులు



శంకరమఠం రోడ్ విజయగణపతి ఆలయం వద్ద భిక్ష స్వీకరిస్తున్న మాలధారణ భక్తులు

సీతంపేట : అయ్యప్ప మాలధారణ ఎంతో విశిష్టమైనది. కఠోర దీక్ష, ఉపవాసం, నేల మీద నిద్రించడం, బ్రహ్మచర్యం, రెండు పూటలా చన్నీటి స్నానం, మూడు పూటలా శరణుఘోష వంటి కఠిన నియమాలతో మండల కాలంపాటు దీక్ష చేస్తారు. మాలధారణ చేసే వారు పీఠం పెట్టుకునేందుకు, మడిగా భిక్ష తయారు చేసుకునేందుకు చాలా ఇళ్లల్లో వీలుపడదు. అలాగే ఉద్యోగస్తులు, మాలధారణ భక్తులు నిత్యం ఎంతో మంది వివిధ పనులపై నగరానికి వస్తుంటారు. ఇలా నగరానికి వచ్చిన స్వాములు మధ్యాహ్నం భిక్ష ఎక్కడ లభిస్తుంది..., ఎక్కడ పీఠం ఉంది... స్వామికి హారతి ఎక్కడ ఇవ్వాలి అన్న సందేహాలతో సతమతమవుతుంటారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న కొంత మంది గురుస్వాములు కమిటీగా ఏర్పడి మాలధారణ భక్తులు భిక్షకు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ఏటా మండల కాలంపాటు ఎంతో వ్యయప్రయాసల కోర్చి అయ్యప్పస్వాములకు, భవానీలకు భిక్ష సమకూర్చుతున్నారు. అక్కయ్యపాలెంలో పలు చోట్ల మాలధారణ భక్తులకు భిక్ష అందిస్తున్నారు. శుచిగా, రుచిగా, వేడివేడిగా భిక్ష అందిస్తూ ఎంతో మంది మన్ననలు అందుకుంటున్నారు.

విజయగణపతి అయ్యప్ప ట్రస్టు ఆధ్వర్యంలో

శంకర మఠం రోడ్‌లో విజయ గణపతి ఆలయం వద్ద విజయ గణపతి అయ్యప్ప ట్రస్టు ఆధ్వర్యంలో రోజూ వెయ్యి నుంచి 1200 మంది స్వాములు, భవానీలకు భిక్ష అందిస్తున్నారు. 10 మంది కమిటీ సభ్యులు తమ సొంత నిధులతో 2014 నుంచి ఏటా మండల కాలం పాటు ఎంతో శుచిగా భిక్ష సమకూర్చుతున్నారు. ఈ ఏడాది నవంబరు 2న అన్నదానం ప్రారంభించారు. డిసెంబర్ 14 వరకు 43 రోజులపాటు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇంట్లో ఏ విధంగా వండి వడ్డిస్తారో అదే తరహాలో రోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 2:30 గంటల వరకు భిక్ష అందిస్తున్నారు.

పోర్టు ఆస్పత్రి కూడలి సమీపంలో...

ఎరుమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పోర్టు ఆస్పత్రి ఎదుట అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. 2010 నుంచి ఏటా 45 రోజులపాటు రోజూ వేల మంది మాలధారణ భక్తులకు నిర్విరామంగా మధ్యాహ్న భిక్ష అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. 10 మంది సభ్యులు ఓ సంఘంగా ఏర్పడి 14 సంవత్సరాలుగా స్వాములకు భిక్ష అందిస్తున్నారు. స్వీటు, హాటు, కూర, పచ్చడి, సాంబారు, మజ్జిగ... ఇలా 11 రకాల వంటకాలతో రోజూ వడ్డిస్తుండడం విశేషం.



శంకరమఠంలో భిక్ష స్వీకరిస్తున్న స్వాములు



పోర్టు ఆస్పత్రి వద్ద 14 ఏళ్లుగా స్వాములకు భిక్ష సమకూర్చుతున్న కమిటీ సభ్యులు

రోజూ మధ్యాహ్నం 12:30 నుంచి 3 గంటల వరకు భిక్ష కొనసాగుతుంది. రోజూ సుమారు 3500 నుంచి 4 వేల మంది భిక్ష స్వీకరిస్తున్నారు. మాలధారణలో ఉన్న ట్రస్టు సభ్యులు స్వయంగా వంట చేసి వడ్డన చేస్తున్నారు. డిసెంబరు 2 వరకు భిక్ష కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

లలితాపీఠంలో... అక్కయ్యపాలెం లలితాపీఠంలో రోజూ అన్నదానం నిర్వహిస్తున్నారు. 100 నుంచి 150 మంది స్వాములు, భవానీలు, భక్తులకు భిక్ష అందిస్తున్నారు. పీఠంలోని వంటశాలలో బ్రాహ్మణులు ఎంతో మడిగా వండి, వేడివేడిగా వడ్డిస్తున్నారు. రోజూ మధ్యాహ్నం 12: 30 గంటలకు అన్నదానం ప్రారంభమవుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

శంకరమఠంలో... పూర్ణపుష్కల అయ్యప్ప సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శంకరమఠంలో మాలధారణ భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. ట్రస్టు వ్యవస్థాపకులు పైలా ఆదిమోహనరెడ్డి గత 38 ఏళ్లుగా గురుస్వామిగా ఉంటూ స్వాములకు అన్నప్రసాదం అందిస్తున్నారు. గత ఏడాది నుంచి శంకరమఠంలో మేడపైన ఉన్న హాలులో మాలధారణ భక్తులకు భిక్ష పెడుతున్నారు. ఈ ఏడాది నవంబరు 2న ప్రారంభించారు. వచ్చే ఏడాది జనవరి 3 వరకు భిక్ష కొనసాగుతుందని, రోజూ మధ్యాహ్నం 600 మందికి అన్న ప్రసాదం అందజేస్తున్నట్టు గురుస్వామి ఆదిమోహనరెడ్డి తెలిపారు.

ఇసుక తవ్వకాలు ప్రైవేటుకివ్వడం అన్యాయం



లేబర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సీతంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఫైల్‌పై పెడతామని హామీలిచ్చిన నాయకులు నేటికీ అమలు చేయలేదని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, జి.ఎస్.జె.అచ్యుతరావు మాట్లాడుతూ గతంలో ఉచిత ఇసుక ఇవ్వాలని, సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీ చేపట్టిన ఉద్యమానికి కూటమి నాయకులు మద్దతు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పక్కన పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. ఉచిత ఇసుక అని ప్రకటించారు తప్ప ఎక్కడా ఉచితంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జీవో నంబరు 66 రద్దు చేయకుంటే ఉచిత ఇసుక పాలసీ నిర్వీర్యం అవుతుందన్నారు. ఇసుక మాఫియాను అరికట్టాలని, ఇచ్చిన మాట ప్రకారం సహజ సంపదను సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా సరఫరా చేసి నిర్మాణ రంగంపై ఆధారపడిన భవన నిర్మాణ కార్మికులకు మేలు చేయాలని కోరారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో పర్యవేక్షణ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మథరావు, ఎస్.కె.రెహమాన్, జి.రాంబాబు, జె.డి.నాయుడు, ఎంఏ బేగం, ఎస్.నాగభూషణరావు, ఎస్.అసిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాబూరావు సేవలు చిరస్మరణీయం



బాబూరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అమరావతి విశ్వసాహితి సభ్యులు

మురళీనగర్ : సాహితీవేత్త, వైద్యులు, సంఘ సేవకుడిగా దివంగత డాక్టర్ కప్పల బాబూరావు అందించిన సేవలు చిరస్మరణీయమని అమరావతి విశ్వసాహితి సభ్యులు అన్నారు. డాక్టర్ బాబూరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సోమవారం అమరావతి విశ్వసాహితి సభ్యులు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వక్తలు మాట్లాడారు. సీహెచ్ చినసూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన వివిధ రంగాల్లో రాణించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరావతి విశ్వసాహితి ప్రతినిధులు ప్రసాద్, పి.ఫ్రాన్సిస్, పి.నిర్మలరాజు, పి.రామారావు, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం



వందన సమర్పణ చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విశాఖ అతిమేత్రాసన వేదికగా మూడు రోజులు నిర్వహించే అంతర పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విశాఖ జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి రవీంద్రబాబు క్రీడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యాన్ని, క్రీడా స్ఫూర్తిని, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విశాఖ అతిమేత్రాసన పాఠశాలల డిప్యూటీ జనరల్ మేనేజర్ ఫాదర్ పాలమరశెట్టి రత్నకుమార్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ, ఫాదర్లు డి.బాలశౌరి, జొన్నాడ జాన్‌ప్రకాశ్, ఎస్.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు మహిళ



నాగమణిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార : బొబ్బిలికి చెందిన ఒక గృహిణి భర్త వేధింపులు తాళలేక విశాఖ వచ్చేయడంతో ఆశ్రయం కల్పించిన వసతిగృహం నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సోమవారం అప్పగించారు. ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలికి చెందిన నాగమణి (45)కి ఇద్దరు పిల్లలున్నారు. మద్యానికి బానిసైన భర్త పెట్టే చిత్రహింసలు భరించలేక ఆమె పిల్లలను బంధువులకు అప్పగించి ఇల్లు వదిలి విశాఖ వచ్చేసింది. రైల్వేస్టేషన్లో తిరుగుతున్న ఆమెకు ఏయూటీడీ సిబ్బంది ద్వారకానగర్‌లో గల టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఆశ్రయమిచ్చారు. ఎట్టకేలకు ఆమె మేనత్త ఆదిలక్ష్మి అడ్రస్ తెలుసుకుని షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి సమక్షంలో నాగమణిని అప్పగించారు.

కుమారుడి చెంతకు తల్లి

అదేవిధంగా ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో ఆశ్రయం పొందుతున్న నడిమింటి రాజేశ్వరి (68)ని కుమారుడికి అప్పగించారు. కొద్ది రోజుల కిందట ఆమె రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండడంతో రైల్వే పోలీసుల సమాచారంతో ఏయూటీడీ సిబ్బంది రాజేశ్వరిని తీసుకొచ్చి ఆశ్రయమిచ్చారు. ఇంతలో రైల్వే ఉద్యోగి అయిన ఆమె పెద్ద కుమారుడు రమణమూర్తి తప్పిపోయిన తల్లిని వెతుక్కుంటూ షెల్టర్‌కు వచ్చారు. తన తమ్ముడు శ్రీకాకుళం నుంచి ఫోన్ చేసి చెప్పడంతో ఆందోళనతో వెతుకుతున్నానని చెప్పారు. తన తల్లిని జాగ్రత్తగా అప్పగించినందుకు షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి, ఇతర సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఏకాదశి పూజలు



పూజలందుకున్న సీతారామలక్ష్మణులు

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, ఎస్.వరప్రసాద్ తెలిపారు. రామాలయంలోని సీతారాములకు ఉదయం క్షీరాభిషేకం, సహస్ర తులసీదళార్చన, సాయంత్రం ఆకాశ దీపారాధన నిర్వహిస్తామన్నారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకోవాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



క్రీడా పోటీల్లో పాల్గొన్న వృద్ధులు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ విజయనగర్‌కాలనీలోని కేంద్రీయ విద్యాలయం-1లో సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ జి.కిషోర్ నేతృత్వంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో వృద్ధులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.మాలిక్, ఉపాధ్యాయులు, వృద్ధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము



ఫిర్యాదు స్వీకరిస్తున్న జెడ్సీ శివప్రసాద్

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఆయన సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూ విభాగానికి 02 వినతులు అందినట్లు తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అధికారులు, ఇతర సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. సమయపాలన పాటించని ఏపీడీవోలు, టౌన్‌ప్లానింగ్ అధికారులపై జెడ్సీ మండిపడ్డారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారాప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏఈ సుమన్ పాల్గొన్నారు.

సీతమ్మధార : నగరంలోని ఆశీలమెట్టలో గల జోన్ – 3 కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు రెండు ఫిర్యాదులు అందాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గోపన్న, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో...

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్జీదారుల నుంచి తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ వినతులు స్వీకరించారు. 11 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మానగర్ శివాలయం వీధిలో నివసిస్తున్న చంద్రశేఖర్ (35) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు విగతజీవిగా వేలాడుతున్న చంద్రశేఖర్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించుకుని, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయాలకు కార్తీక శోభ

- వేకువజాము నుంచే అర్చనలు, పంచామృతాభిషేకాలు
- ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ



శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



విశేష అలంకరణలో పార్వతీశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు



పార్వతీశ్వరాలయంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న బాల మురుగన్ సేవా సమితి



మురళీనగర్‌లో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు



కోదండ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



పూజలందుకున్న ఉమానీలకంఠేశ్వర స్వామి



సీతంపేటలో పార్వతీశ్వరునికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట : శివాలయాలన్నీ కార్తీక శోభతో కళకళలాడాయి. కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనం కోసం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, శంకరమఠం రోడ్‌లో గల రామలింగేశ్వరాలయం, అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠం భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు ఉదయాన్నే శివునికి జలాభిషేకం, అనంతరం పంచామృతాభిషేకం జరిపారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, ఉసిరి, జమ్మి, మారేడు, నేరేడు, రావి చెట్లకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. సీతంపేటలోని పార్వతీశ్వరాలయంలోని పార్వతీశ్వరుడు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలమురుగన్ సేవా సమితి వ్యవస్థాపకులు ఇప్పిలి అప్పలనాయుడు, సంతోషలక్ష్మి దంపతులు భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధనను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శంకర మఠం రోడ్‌లోని రామలింగేశ్వరాలయంలో అర్చనలు, అభిషేకాలు, దీపారాధన, శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్పొరేటర్ ముక్కా శ్రావణి స్వామిని దర్శించి పూజలు చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కంచరపాలెం : కంచరపాలెంలోని పలు శివాలయాల్లో కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 104 ఏరియా బాపూజీనగర్, కోదండ కాశీవిశ్వేశ్వరాలయంలో అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు ఎం.సూర్యప్రకాశ్‌శర్మ, తిక్కవానిపాలెంలో అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో రామకృష్ణ శర్మ, కంచరపాలెం మెయిన్‌రోడ్డులోని గౌరీ పరమేశ్వరాలయంలో అర్చకులు శ్రీనివాస దీక్షితులు, సుభాష్‌నగర్‌లో ధర్మగర్భ ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు జగన్మోహన్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

తిక్కవానిపాలెం, ధర్మానగర్, బాపూజీ నగర్, రెడ్డి కంచరపాలెం ప్రాంతాల్లో శివనామస్మరణ మార్మోగింది. విభూది అభిషేకాలు, బిల్వార్చన, క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులే స్వహస్తాలతో శివలింగానికి పాలతో అభిషేకాలు జరిపారు.

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. మురళీనగర్‌లోని రామాలయంలో వెలసిన ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఉదయం 4.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మంచిలి భానుమూర్తి ఆధర్వ్యంలో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోషకాల నక్షత్ర హారతి సమర్పించారు. సత్యానగర్‌లోని సోమలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

సీతమ్మధార : నక్కవానిపాలెంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో భక్తులకు సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అర్చకులు రామారావు శర్మ, ఉమామహేష్ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. డిసెంబర్ 2 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఈ నెల 15న జ్వాలాతోరణం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

యువతకు ఉన్నత విద్యే ఎన్ఈపీ లక్ష్యం

విశాఖ విద్య: దేశ యువతను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మలచడమే నూతన విద్యా విధానం(ఎన్ఈపీ) లక్ష్యమని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఎక్కువ శాతం మంది యువత ఉన్నత విద్యలో ప్రవేశించేలా చేయడమే నూతన విద్యా విధానం లక్ష్యమని తెలిపారు. బట్టీ పట్టే విధానం నుంచి విద్యార్థులను స్వయంగా నేర్చుకునేలా ప్రోత్సహిస్తారన్నారు. ఉన్నత విద్యలో మల్టీ డిసిప్లీనరీ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారని, డిజిలాకర్, అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ) వంటివి విద్యార్థులకు ఎంతో సౌలభ్యాన్ని అందిస్తున్నాయని చెప్పారు. విశిష్ట అతిథి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే కీలకమన్నారు. మను కేంద్రీయ విశ్వవిద్యాలయం శాటిలైట్ క్యాంపస్(బిహార్) విద్యా విభాగం ఆచార్యుడు పి.ఆడం పాల్ పాటేటి మాట్లాడుతూ కోవిడ్ అనంతరం బోధన అభ్యసన విధానాల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. సదస్సు సంచాలకుడు, విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు మాట్లాడుతూ సదస్సుకు 2020 పరిశోధన పత్రాలు వచ్చాయని, వీటిని ప్రత్యేక సంచికగా తీసుకొస్తామని తెలిపారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నాగరాజా కుమారి తదితరులు ప్రసంగించారు. సదస్సు ప్రత్యేక సంచికను అతిథులతో కలిసి వీసీ శశిభూషణరావు ఆవిష్కరించారు.